E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 20-07-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



మరో రెండు రోజులు భారీ వర్షాలు » 3లో

ఈపీఎఫ్‌వో రూల్స్‌లో మార్పు.. ఆ కండీషన్లు ఇక ఉండవు » 4లో

EPFO


రెండో వన్డేలో భారత్‌పై ఇంగ్లాండ్ విజయం » 6లో



భర్తకు దూరంగా హన్సిక? తల్లింట్లోనే నివాసం! సోహెల్ ఏమన్నాడంటే? » 5లో



వరంలో వరాల జల్లు » 3లో



# డేటా కాదు... తెలంగాణ మెగా హెల్త్ చెకప్

- అది కేవలం సమాచార నివేదిక కాదు
- సామాజిక న్యాయానికి అదే కీలకం
- సర్వేపై నియమించిన నిపుణుల కమిటీ భేటీలో సీఎం రేవంత్
- కుల సర్వేపై సీఎంకు కమిటీ నివేదిక..
- దీనిపై కేబినెట్‌లో చర్చించి చర్యలు తీసుకుంటామన్న సీఎం




సీఎం రేవంత్‌రెడ్డికి అధ్యయన నివేదికను అందిస్తున్న స్వతంత్ర నిపుణుల కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో నివేదిక ప్రతులతో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొన్నం, సీతక్క, కమిటీ వైస్ చైర్మన్ కంచ ఐలయ్య తదితరులు

తరువాయి 2లో

## రాష్ట్రంలో భారీగా రైల్వే సేవల విస్తరణ

- కాచిగూడ–జోద్‌పూర్ రైలు సర్వీసును ప్రారంభిస్తున్న అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు
- కాచిగూడ–జోద్‌పూర్ రైలు ప్రారంభోత్సవంలో రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్



తరువాయి 2లో

## దౌత్య విభేదాల తర్వాత.. తొలిసారి మాల్దీవులకు ప్రధాని మోదీ



ఈ కబురు: ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారంలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జులై 23 నుంచి 26 వరకు యూకే, మాల్దీవుల్లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. గతేడాది మోదీపై, లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. విభేదాల అనంతరం ప్రధాని ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేశారు.

తరువాయి 2లో

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎ.కె.సింగ్ ప్రమాణం



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు 7వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎ.కె.సింగ్‌తో ప్రమాణం చేయించారు. » 2లో

# రూ.14లక్షల కోట్లతో.. చైనా 'మెగా డ్యామ్' పనులు ప్రారంభం

ఈ కబురు: ప్రపంచంలోనే అత్యంత భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణాన్ని చైనాప్రారంభించింది. శనివారం మొదలైన ఈ ప్రాజెక్టు పనుల కార్యక్రమంలో చైనా ప్రధాని లీ కియాంగ్ పాల్గొన్నారు. టిబెట్‌లోని యార్లంగ్ జాంగ్బో (బ్రహ్మపుత్ర) నదిపై చేపడుతోన్న ఈ వివాదాస్పద ప్రాజెక్టు కోసం డ్రాగన్ దాదాపు 1.2 ట్రిలియన్ యువాన్‌లు (సుమారు రూ.14లక్షల కోట్లు) ఖర్చు పెట్టనున్నట్లు అంచనా. ఈ ప్రాజెక్టుపై భారత్, బంగ్లాదేశ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ డ్రాగన్ మాత్రం మొండిగా ముందుకు పోతున్నట్లు కనిపిస్తోంది.

తరువాయి 2లో



# బరువు తగ్గించే ఔషధాల అన్వేషణలో కిమ్.. కానీ,!

ఈ కబురు: ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఏం చేసినా సంచలనమే. కానీ ఆయన పనులకు బుక్ అయ్యేది మాత్రం ఆ దేశ ప్రజలే. ప్రస్తుతం బరువును తగ్గించే ఔషధాల అన్వేషణలో ఈ నియంత పడిపోయారట.

తరువాయి 2లో



## భారత్ పాక్ ఘర్షణను నేనే ఆపా.. మరోసారి ట్రంప్ కీలక వ్యాఖ్యలు



» 3లో

## మౌనంగా ఉన్నానని బలహీనుడిగా భావించొద్దు



» 3లో

# మెట్రో రెండో దశపై కేంద్రం నిర్లక్ష్యం



- మల్లు రవి, చామల కిరణ్, రఘునందన్
- డీపీఆర్‌లు ఇచ్చి 9 నెలలైనా ఆమోదించలేదు
- ఈ ప్రాజెక్టు కోసం కలిసికట్టుగా పోరాడుదాం
- రాష్ట్రంలోని ఎంపీల సమావేశంలో భట్టి, కోమటిరెడ్డి
- ఆదాయం ఎలా పంచుకుంటారని బీజేపీ ఎంపీల ప్రశ్న

ఈ కబురు, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై 9 నెలల క్రితమే కేంద్రానికి డీపీఆర్‌లు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఆమోదించకపోవడం అన్యాయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పార్టీలకు అతీతంగా ఈ ప్రాజెక్టు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల నేపథ్యంలో మెట్రో రైల్ ప్రాజెక్టు విషయంలో ఎదురవుతున్న సవాళ్లపై శనివారం పార్క్‌హయత్ హోటల్‌లో ప్రభుత్వం వివిధ పార్టీల ఎంపీలతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, కిరణ్ కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, పోరిక బలరాం నాయక్, అనిల్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్, బీజేపీ ఎంపీలు

తరువాయి 2లో



# వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్

- మద్యం కుంభకోణం కేసులో అదుపులోకి తీసుకున్న సిట్
- 'బిగ్‌బాస్' తరఫున దోపిడీకి కుట్ర, అమల్లో ప్రధాన పాత్ర
- ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్ రూపొందించింది ఆయనే

ఈ కబురు: మద్యం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో ఒకరు, ఈ కేసులో కీలక నిందితుడైన (ఏ4) వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో అరెస్టు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకూ సుదీర్ఘంగా ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు.. విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించకపోవటంతో నిర్బంధంలోకి తీసుకున్నారు. ఈ మేరకు మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

తరువాయి3లో

మొదటి పేజీ తరువాయి

# డేటా కాదు... తెలంగాణ మెగా హెల్త్ చెకప్



ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే.. కేవలం సమాచార నివేదిక కాదని, రాష్ట్రానికి మెగా హెల్త్ చెకప్ లాంటి దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సర్వే నివేదికపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కంచె ఐలయ్య, సభ్యులు ప్రొఫెసర్ శాంతాసిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, డా.సుఖ్‌దేవ్ తొరాట్, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య భూక్య, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, ప్రొఫెసర్ జీన్‌డ్రెజ్, ప్రొఫెసర్ థామస్ పికెట్టి, ప్రవీణ్ చక్రవర్తి, కార్యదర్శి అనుదీప్ దురిశెట్టితో సీఎం శనివారం సమావేశమయ్యారు. కమిటీ తన అధ్యయన నివేదికను సీఎం సమర్పించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో సమగ్ర సర్వేను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సమగ్ర సర్వేపై చేపట్టిన అధ్యయన నివేదిక రాష్ట్రంలో బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయాన్ని అమలు చేసేందుకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు, ఇందుకుగల కారణాలపై నిపుణుల కమిటీ అధ్యయనం చేయాలని కోరారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. నిపుణుల కమిటీ నివేదికలోని అంశాలపై కేబినెట్ సమావేశంలో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**దేశ దిశను మార్చనున్న సమగ్ర సర్వే..**

సమగ్ర సర్వే, దానిపై నిపుణుల కమిటీ అధ్యయన నివేదిక దేశ దిశను మారుస్తాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సమగ్ర సర్వేపై వివాద రహితులైన వివిధ రంగాల మేధావులతో కమిటీ వేయటం చరిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఇలాంటి సర్వే దేశంలో ఇప్పటివరకు ఎక్కడా జరగలేదని తెలిపారు. బిహార్‌లో సర్వే చేసినప్పటికీ న్యాయస్థానాల్లో దానికి బ్రేకులు పడ్డాయని గుర్తుచేశారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడితే లోపం ఉందని ఎవరూ చెప్పలేదని తెలిపారు. సీఎంగా, స్వతంత్ర నిపుణుల కమిటీ చైర్మన్‌గా, కుల గణన కమిటీ చైర్మన్‌గా రెడ్లు ఉన్నప్పటికీ ఎలాంటి భేదాలు లేకుండా అణగారిన వర్గాలకు ప్రయోజనం చేకూర్చాలన్న బాధ్యతతో పని చేయడంతో సర్వే విజయవంతమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ.శరత్ తదితరులు పాల్గొన్నారు.

**రెండు భాగాలుగా నివేదిక**

సమగ్ర సర్వేను దాదాపు నాలుగు నెలల పాటు స్వతంత్ర కమిటీ అధ్యయనం చేసింది. సమగ్ర సర్వే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల ప్రజల స్థితిగతులు.. విద్య, భూమి, సంక్షేమం, ఉపాధి రంగాల్లో ఎవరెవరి పరిస్థితి ఎలా ఉందనే అంశాలను భిన్న కోణాల్లో పరిశీలించింది. రాష్ట్రంలో 242 కులాల వెనుకబాటుతనాన్ని విశ్లేషణ చేసింది. కంపోజిట్ బ్యాక్‌వర్డ్‌నెస్ ఇండెక్స్‌ను తయారు చేసి కులాలకు గ్రేడింగ్/ర్యాంకు ఇచ్చింది. ఈ నివేదిక 320 పేజీల్లో ఉండగా... దీన్ని రెండు భాగాలుగా ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికను పూర్తిగా పరిశీలించిన తర్వాత ప్రజలకు అనువైన విధంగా సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచాలని కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా సూచించారు.

మొదటి పేజీ తరువాయి

# దౌత్య విభేదాల తర్వాత.. తొలిసారి మాల్దీవులకు ప్రధాని మోదీ



ఈ కబురు: ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారంలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జులై 23 నుంచి 26 వరకు యూకే, మాల్దీవుల్లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. గతేడాది మోదీపై, లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. విభేదాల అనంతరం ప్రధాని ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేశారు.

జులై 2324 తేదీలలో మొదట యూకేలో జరగనున్న భారత్‌బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పై జరిగే చర్చల్లో మోదీ పాల్గొని.. ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. యూకే ప్రభుత్వంతో దౌత్య, వాణిజ్య చర్చలు జరపనున్నారు. అనంతరం జులై 2526 తేదీలలో ప్రధాని మాల్దీవులకు వెళ్లనున్నారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతారు.

గతేడాది జనవరిలో లక్షద్వీప్‌ను సందర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ.. సాహసాలు చేయాలనుకున్నవారు ఇక్కడికి రావాలని పిలుపునిచ్చారు. దీనిపై మాల్దీవుల మంత్రులు

# 2027 నాటికి మూడో అతి పెద్ద ఆర్థికశక్తిగా భారత్: అమిత్ షా



**ఈ కబురు: ఎన్డీఏ పాలనలో భారత్ ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ.. వేగంగా ముందుకు వెళ్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 2027 నాటికి దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రపుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. 2014లో భాజపా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దేశంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. పదేళ్లలో దేశాభివృద్ధిలో 60శాతం పెరుగుదల చోటుచేసుకుందని పేర్కొన్నారు.**

**దేశవ్యాప్తంగా 45వేల కిలో మీటర్ల రైల్వే లైన్లు, రోడ్లు నిర్మించామని అమిత్ షా అన్నారు. ప్రధానిగా ఉన్న సమయంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ దేశాన్ని 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చితే.. మోదీ దానిని నాలుగో స్థానానికి తీసుకువచ్చారన్నారు. త్వరలో భారత్‌ను ప్రపంచంలోనే మూడో ఆర్థిక శక్తిగా మార్చేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెడతానని ప్రధాని మోదీ ప్రతిజ్ఞ చేశారని.. దానికోసం తామందరం పని చేస్తున్నామని అన్నారు. దేవభూమిగా పేరుగాంచిన ఉత్తరాఖండ్‌కు రానున్న రోజుల్లో ప్రపంచం నలుమూలల నుంచి అనేక మంది పర్యాటకులు వచ్చేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు.దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ అంచనాలను ఉటంకిస్తూ..అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అమిత్ షా అన్నారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచంలోని వివిధ కంపెనీలను ఆహ్వానించడం మొదలైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.**

మొదటి పేజీ తరువాయి

# రాష్ట్రంలో భారీగా రైల్వే సేవల విస్తరణ



ఈ కబురు, హైదరాబాద్/కాచిగూడ: తెలంగాణలో రైల్వే మౌలిక వసతులను భారీగా విస్తరించినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దశలవారీగా రైల్వే నెట్‌వర్క్ పెంచినట్లు చెప్పారు. కాచిగూడ-జోద్‌పూర్ డెయిలీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును శనివారం కాచిగూడ స్టేషన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న రాజస్తాన్ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు.

హైదరాబాద్ నుంచి భోపాల్ మీదుగా జోద్‌పూర్‌కు ప్రతిరోజూ రైలు రాకపోకలు సాగిస్తుందని చెప్పారు. ఈ రైలును అహ్మదాబాద్ మీదుగా నడపాలని డిమాండ్లు వస్తున్నాయని, కానీ అహ్మదాబాద్‌లో కొన్ని నిర్మాణ పనుల వల్ల ప్రస్తుతం ఆ మార్గంలో నడపడం సాధ్యం కాదని తెలిపారు. మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైల్వేస్టేషన్లను ఆధునిక హంగులతో పునరాభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రూ.720 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్ స్టేషన్ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సహా సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

**శంకర్‌పల్లి టు కాజీపేట రైలు ప్రయాణం**

శంకర్‌పల్లి: సంగారెడ్డి జిల్లాలోని ఐఐటీ హైదరాబాద్ స్నాతకోత్సవానికి శనివారం వచ్చిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్.. అక్కడ నుంచి కాజీపేటకు వెళ్లేందుకు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అక్కడి నుంచి రైలులో కాజీపేటకు ప్రయాణించారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులు ఉన్నారు.

# రూ.14లక్షల కోట్లతో.. చైనా 'మెగా డ్యామ్' పనులు ప్రారంభం

ఈ కబురు: ప్రపంచంలోనే అత్యంత భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణాన్ని చైనాప్రారంభించింది. శనివారం మొదలైన ఈ ప్రాజెక్టు పనుల కార్యక్రమంలో చైనా ప్రధాని లీ కియాంగ్ పాల్గొన్నారు. టిబెట్‌లోని యార్లంగ్ జాంగ్బో (బ్రహ్మపుత్ర) నదిపై చేపడుతోన్న ఈ వివాదాస్పద ప్రాజెక్టు కోసం డ్రాగన్ దాదాపు 1.2 ట్రిలియన్ యువాన్‌లు (సుమారు రూ.14లక్షల కోట్లు) ఖర్చు పెట్టనున్నట్లు అంచనా. ఈ ప్రాజెక్టుపై భారత్, బంగ్లాదేశ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ డ్రాగన్ మాత్రం మొండిగా ముందుకు పోతున్నట్లు కనిపిస్తోంది. 'చైనా యాజియాంగ్ గ్రూపు' పేరుతో కొత్తగా ఓ సంస్థను ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్టు బాధ్యతలు దీనికి అప్పజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులో మొత్తం ఐదు డ్యామ్‌లు ఉండనున్నాయి. టిబెట్‌లోని నైంగ్చి నగరంలో.. భారీ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా దీన్ని చేపడుతున్నారు. ఈ విద్యుత్‌ను బయటకే సరఫరా చేయనున్నప్పటికీ స్థానిక అవసరాలకు కూడా కొంతమేర వినియోగించనున్నట్లు సమాచారం.

**ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్టు..**

భారీ ఖర్చుతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా నిలువనుంది. దీనిద్వారా ఏటా 300 బిలియన్ కిలోవాట్ అవర్స్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ఇది చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో నిటారుగా పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తికి అవకాశాలున్నాయి.



**భారత్ ఆందోళన వ్యక్తం చేసినా..**

హిమాలయాల్లో టిబెట్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌కు నది గమనంలో వంపు తిరిగే చోట ఈ డ్యామ్‌ను నిర్మిస్తున్నారు. భారీ డ్యామ్ నిర్మాణం వల్ల ఇక్కడి భౌగోళిక ప్రదేశానికి, పర్యావరణానికి తీరని నష్టం కలగవచ్చనే అభిప్రాయాలున్నాయి. దీనివల్ల అరుణాచల్‌తోపాటు అస్సాం రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ రెండు దేశాల మధ్య సంఘర్షణ సంభవిస్తే చైనా ఈ డ్యామ్ నుంచి ఒక్కసారిగా భారీ పరిమాణంలో నీటిని విడుదలచేస్తే అక్కడి భూభాగాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

**మొండిగా ముందుకు..**

దీనిపై భారత విదేశాంగ ఇటీవల స్పందిస్తూ.. ఈ ప్రాజెక్టుపై పర్యవేక్షణ కొనసాగిస్తామని, తమ దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఎగువ ప్రాంతాల్లో నిర్మించే ప్రాజెక్టుల వల్ల దిగువన ఉన్న ప్రాంతాలకు హాని కలగకుండా చూసుకోవాలని చైనాకు సూచించింది. ఈ నేపథ్యంలో తన నిర్ణయాన్ని సమర్థించుకున్న చైనా.. ఈ ప్రాజెక్ట్ విషయంలో అనేక శాస్త్రీయ అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని, భారత్, బంగ్లాదేశ్‌లపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపదని తెలిపింది. భారత్‌లో నదీ ప్రవాహంపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొంది.

# బరువు తగ్గించే ఔషధాల అన్వేషణలో కిమ్.. కానీ,!



ఈ కబురు: ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఏం చేసినా సంచలనమే. కానీ ఆయన పనులకు బుక్ అయ్యేది మాత్రం ఆ దేశ ప్రజలే. ప్రస్తుతం బరువును తగ్గించే ఔషధాల అన్వేషణలో ఈ నియంత పడిపోయారట. అయితే వాటిని తనలాంటి శరీరతత్వం ఉన్న పౌరులపై ప్రయోగించిన తర్వాతే తీసుకోవాలని భావిస్తున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కిమ్ జోంగ్ ఉన్ మద్యానికి, సిగరెట్లకు బానిసైనట్లు గతంలో అమెరికాకు చెందిన ఓ పత్రిక పేర్కొంది. దాంతో ఆయన నిద్రలేమి సమస్యలతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. ఫలితంగా ఆయన 140 కేజీల వరకు బరువుపెరిగి ఉండొచ్చని రాసుకొచ్చింది. ఈ క్రమంలోనే అంతర్జాతీయ మీడియా కిమ్ బరువు తగ్గాలనుకోవడం గురించి రాసుకొచ్చింది. అందుకోసం ఆయన ఎలాంటి ప్రయత్నానికైనా, ఎంత ఖర్చుకైనా వెనకాడటం లేదని సంబంధిత వర్గాలు వెల్లడించినట్లు తెలిపింది. తనను సన్నగా మార్చే, ఊబకాయం తగ్గడానికి ఉపయోగించే ఔషధాలు విదేశాల్లో ఎక్కడ ఉన్నాయో వెతకాలంటూ తన సన్నిహితులను ఆదేశించినట్లు ఆ కథనం పేర్కొంది. అలా గుర్తించిన వాటిని ఆయన నేరుగా వాడరట. ఆయన మాదిరే శరీరాకృతి, మెడికల్ హిస్టరీ ఉన్నవారిపై తొలుత ప్రయోగించనున్నట్లు సమాచారం. గతంలో కిమ్ తండ్రి కూడా నొప్పి నివారించే మందులను తన సహాయకులకు ఇంజెక్ట్ చేశారట.ఐదు అడుగుల ఆరు అంగుళాలు ఉండే కిమ్.. 2021లో ఒక్కసారిగా బరువు తగ్గిన దశ్యాలు వెలుగులోకి వచ్చాయి. వాటివల్ల అప్పట్లో ఆయన ఆరోగ్యంపై చర్చలు జరిగాయి. అయితే మళ్లీ ఆయన బరువు పెరిగినట్లు పలు చిత్రాల్లో వెల్లడవుతోంది. ఆయనకు మధుమేహం, హైబీపీ ఉన్నట్లు, కీళ్ల సంబంధిత సమస్యలు ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. అలాగే ఆయన బహిరంగ కార్యక్రమాల్లో ఎప్పుడూ కూర్చొనే కనిపిస్తారని, ఎక్కువ దూరం నడవరని ఉత్తర కొరియా పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఇక కిమ్ తండ్రి, తాత గుండె సంబంధిత సమస్యలతో ప్రాణాలు కోల్పోయారు. అది కూడా కిమ్ బరువు తగ్గేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు ఓ కారణం కావొచ్చని తెలుస్తోంది.

# హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎ.కె.సింగ్ ప్రమాణం



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు 7వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎ.కె.సింగ్‌తో ప్రమాణం చేయించారు. దైవసాక్షిగా, రాగద్వేషాలకు అతీతంగా, రాజ్యాంగ, చట్టబద్ధంగా విధులు నిర్వహిస్తానని ఆయన ప్రమాణం చేశారు. అంతకుముందు రిజిస్ట్రార్ జనరల్ గోవర్ధన్‌రెడ్డి.. జస్టిస్ ఎ.కె.సింగ్ బదిలీ ఉత్తర్వులను చదివి వినిపించారు. ప్రమాణం అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి, సీఎస్ కె.రామకృష్ణారావు, జస్టిస్‌ఎ.కె.సింగ్ కుటుంబ సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, రిజిస్ట్రార్‌లు తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో రెండో దశపై కేంద్రం నిర్లక్ష్యం



ఈ కబురు, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై 9 నెలల క్రితమే కేంద్రానికి డీపీఆర్‌లు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఆమోదించకపోవడం అన్యాయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పార్టీలకు అతీతంగా ఈ ప్రాజెక్టు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు.

పార్లమెంటు వర్షాకాల సమావేశాల నేపథ్యంలో మెట్రో రైల్ ప్రాజెక్టు విషయంలో ఎదురవుతున్న సవాళ్లపై శనివారం పార్క్‌హయత్ హోటల్‌లో ప్రభుత్వం వివిధ పార్టీల ఎంపీలతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, కిరణ్ కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, పోరిక బలరాం నాయక్, అనిల్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్ రావు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మెట్రో రెండో దశపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, అన్ని పార్టీల ఎంపీలు సహకరిస్తేనే మెట్రో రెండో దశను సాధించుకోగలమని చెప్పారు. తెలంగాణ కంటే చిన్న రాష్ట్రాల్లో మెట్రో నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని, మన రాష్ట్రంపై మాత్రం కేంద్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు.

**ఎల్‌అండ్‌టీతో ఎలా ముందుకెళ్తారు?**

పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో మెట్రో మొదటి దశ నిర్మాణం చేపట్టిన ఎల్‌అండ్‌టీ సంస్థతో కలిసి రెండో దశపై ఎలా ముందుకెళ్తారని బీజేపీ ఎంపీలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రెండోదశ పూర్తయితే ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగి ఎల్‌అండ్‌టీకి కూడా ఆదాయం లభిస్తుంది. ప్రయాణికుల నుంచి టికెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఎల్‌అండ్‌టీతో కలిసి ఎలా పంచుకుంటారు? విద్యుత్ భారం, నిర్వహణ ఖర్చులపై కూడా స్పష్టత రావాల్సి ఉంది'అని పేర్కొన్నారు.

ఎంపీలు లేవనెత్తిన సందేహాలపై ఎన్వీఎస్ రెడ్డి వివరణ ఇచ్చారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ మహా నగరాన్ని రాజకీయాలకతీతంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ట్రిపుల్ ఆర్ పూర్తయిన తర్వాత హైదరాబాద్ లోపలి వైపున రవాణా వ్యవస్థను ఎంత అభివృద్ధి చేసుకుంటే ప్రపంచ స్థాయి నగరాలతో హైదరాబాద్ అంతగా పోటీ పడుతుందని అభిప్రాయపడ్డారు.

# మౌనంగా ఉన్నానని బలహీనుడిగా భావించొద్దు

**హుజూరాబాద్ నియోజకవర్గంలో అన్ని స్థానాల్లో మావాళ్లే పోటీ చేస్తారు**

**సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోను**

**ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు**




మేడ్చల్, ఈ కబురు: హుజూరాబాద్ నియోజకవర్గ కార్యకర్తలు 20 ఏళ్లుగా తన వెంటే నడుస్తున్నారని, వారికి టికెట్ ఇస్తే సరే.. లేదంటే వార్డు సభ్యుల నుంచి సర్పంచి వరకు, ఎంపీటీసీ నుంచి ఎంపీపీ, జడ్పీటీసీ నుంచి జడ్పీ ఛైర్మన్ పదవుల వరకు అన్ని స్థానాల్లో పోటీ చేసి గెలుస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మండలం పూడూరులోని ఈటల రాజేందర్ నివాసానికి శనివారం హుజూరాబాద్ నియోజకవర్గ భాజపా నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పార్టీ పదవుల్లో తమకు అవకాశం ఇవ్వడం లేదని, బండి సంజయ్ వర్గం పట్టించుకోవడం లేదని ఈటలకు ఫిర్యాదు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ భవితవ్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. వారితో సమావేశమైన అనంతరం మీడియాతో ఈటల మాట్లాడారు.

తుపాను వచ్చేముందు సముద్రం ప్రశాంతంగా ఉంటుందని, మౌనంగా ఉండేవాడిని బలహీనుడిగా భావించవద్దని అన్నారు. పిచ్చివేషాలు వేస్తే నష్టం ఎవరికో కుట్రలు చేసేవారికే తెలుస్తుందని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో అబద్ధాల పునాదులపై కొందరు బతుకుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటానన్నారు. సర్పంచి అభ్యర్థులకు 'బీఫాం' అవసరం లేదని, తమ వాళ్లే పోటీలో ఉంటారని, ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పది రోజులకోసారి హుజూరాబాద్‌కు వస్తానని, కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. శామీర్‌పేట భాజపా అడ్డా అని, తాను భాజపా ఎంపీనని అన్నారు. దక్షిణ భారతదేశంలో మోదీ మొదట ప్రచారం చేసిన గడ్డ ఇదేనని, పార్టీకి ఊపిరి పోసే అడ్డా అని, రేపటి విజయానికి సంకేతమిచ్చే అడ్డా ఇదేనని పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో ఎవరో శాడిస్టు ఎవరి అండతోనో దుష్ప్రచారం చేస్తున్నారని, రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. తాను శత్రువుతో కొట్లాడతానని, కత్తులు కడుపులో పెట్టుకొని కౌగిలించుకునే విష సంస్కృతి లేదని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోనని, భాజపా అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. పదవుల కోసం ఏనాడూ పార్టీలు మారలేదని, 2021 ఉప ఎన్నికలో కొందరు నాయకులు అమ్ముడుపోయినా హుజూరాబాద్ ప్రజలు తనను గెలిపించారని తెలిపారు. నాడు పార్టీని వీడిన తర్వాత కూడా మాజీ సీఎం కేసీఆర్ తనకు నరకం చూపించారని ఆవేదన

# వర్షంలో వరాల జల్లు



**తిరుపతి అభివృద్ధికి రూ.వంద కోట్లు కేటాయిస్తాం**

**శ్రీవారి పాదాల చెంతకు హంద్రీ-నీవా జలాలు**

**సీఎం చంద్రబాబు హామీ**

ఈ కబురు, తిరుపతి; న్యూస్‌టుడే బృందం : జల్లులు పడుతున్న సమయంలో తిరుపతి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా ప్రజానీకానికి వరాల జల్లు కురిపించారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించామని.. తిరుపతి, తిరుమల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు హంద్రీనీవా నీటిని శ్రీవారి పాదాల చెంతకు తెస్తానని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

దుర్మార్గులు.. అన్నీ మధ్యలో ఆపేశారు

'నగరంలోని ప్రతి వీధిలో మీ కళ్ల ముందే తిరుగుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన నేను ఎన్నడూ నేర, హింసా రాజకీయాలను ప్రోత్సహించలేదు. గరుడ వారధి నిర్మాణం కూడా అనుకున్న విధంగా జరగకుండా దుర్మార్గులు మధ్యలో ఆపేశారు. అవిలాల చెరువు సుందరీకరణ పనులు నిలిపారు. మామిడి కొనుగోలుకు రూ.260 కోట్లు విడుదల చేసి.. రైతుల కష్టాలు తీర్చాం. తిరుపతిలో రౌడీయిజాన్ని అంతం చేశాం. స్వేచ్ఛగా బతకడానికి ప్రభుత్వమే కారణం' అని సీఎం పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. '2029 నాటికి తిరుపతి, తిరుమల నీటి సమస్యకు సీఎం పరిష్కారం చూపుతారు. తిరుపతిలోని 6,379 బంగారు కుటుంబాలు, వారి మార్గదర్శకుల్ని ఈ నెలాఖరుకు పూర్తి చేస్తాం' అని అన్నారు. తిరుపతిలో 30 ఏళ్ల భూగర్భ మురుగునీటి వ్యవస్థ శిథిలావస్థకు చేరిందని, సమస్య పరిష్కరించాలని సీఎంను ఎమ్మెల్యే కోరారు. అక్టోబర్ 2 నాటికి జిల్లాను ప్లాస్టిక్ రహితం చేద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు.

కొత్త ఉత్సాహం

స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర లక్ష్యంగా సాగిన సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటన ఎన్నడూ లేనంతగా విజయవంతమైంది. పర్యావరణ పరిరక్షణ, పేద కుటుంబాలకు అండాదండ, ఆధ్యాత్మిక కార్యక్రమాల మేళవింపుగా జరిగిన పర్యటనలో రాజకీయ వేడి రగిలించారు. ప్రజా వేదిక సభలో యువకుల అరుపులు.. కేరింతలు నిలువరించేందుకు పోలీసు అధికారులు సభా ప్రాంగణం మధ్యలో నిలబడాల్సి వచ్చింది. వేదిక వద్ద ముఖ్యమంత్రి పలు ప్రదర్శనలను తిలకించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

శ్రీకపిలేశ్వరస్వామిని దర్శించుకుని.. దీక్షలో ఉన్న కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, పురపాలిక శాఖ మంత్రి పి.నారాయణ, ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, నగరపాలిక కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

# భారత్ పాక్

## ఘర్షణను నేనే ఆపా.. మరోసారి ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**ఈ కబురు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆపరేషన్ సిందూర్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. మే నెలలో భారత్ పాక్ మధ్య జరిగిన ఘర్షణలో ఐదు జెట్లు కూలిపోయాయని తెలిపారు. వాటిని గాలిలోనే పేల్చేశారని చెప్పారు. వైట్ హౌస్ లో రిపబ్లికన్ సెనేటర్లకు ఇచ్చిన విందులో ట్రంప్ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ టైంలో ఐదు విమానాలను గాలిలోనే పేల్చి వేసినట్టు భావిస్తున్నానని తెలిపారు. అయితే ఏ దేశ విమానాలు కూలిపోయాయనే విషయంపై ట్రంప్ క్లారిటీ ఇవ్వలేదు. తన జోక్యం తర్వాతే భారత్ పాక్ మధ్య ఘర్షణ ఆగిపోయినట్టు మరోసారి పునరుద్ఘాటించారు. తమ ప్రభుత్వం ఆరు నెలల్లోనే ఎన్నో విజయాలు సాధించిందని కొనియాడారు. అనేక తీవ్రమైన యుద్ధాలను ఆపామని నొక్కి చెప్పారు. ట్రంప్ తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పందించారు. ట్రంప్ కామెంట్స్ పై ప్రధాని మోడీ పార్లమెంటులో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.**

# వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్





ఈ కబురు: మద్యం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో ఒకరు, ఈ కేసులో కీలక నిందితుడైన (ఏ4) వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో అరెస్టు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకూ సుదీర్ఘంగా ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు.. విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించకపోవటంతో నిర్బంధంలోకి తీసుకున్నారు. ఈ మేరకు మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఈ కేసులో అరెస్టైన తొలి ప్రజాప్రతినిధి ఆయనే. జగన్ ప్రభుత్వ హయాంలో నూతన మద్యం విధానం ముసుగులో 'వైకాపా ముఠా' సాగించిన దోపిడీకి కుట్ర, అమలుకు ఏర్పాట్లు, ముఠా సభ్యులకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేయటంలో మిథున్‌రెడ్డిదే 'మాస్టర్ మైండ్' అని సిట్ దర్యాప్తులో గుర్తించింది. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపుల వసూళ్ల కోసం రాజ్ కెసిరెడ్డితో కలిసి హవాలా నెట్‌వర్క్ రూపొందించటంలో, వారు వసూలు చేసిన మొత్తాల్ని 'బిగ్‌బాస్'కు చేర్చటంలో ఆయనే కీలక పాత్ర పోషించారని తేల్చింది. పలు డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని సొంత బ్రాండ్ల మద్యం తయారు చేయించి లబ్ధి పొందటమే కాకుండా, ముడుపుల సొత్తులో ప్రతి నెలా రూ.5 కోట్ల చొప్పున వాటాగా పొందారని దర్యాప్తులో వెల్లడైంది. వీటన్నింటికీ కీలక ఆధారాలు లభ్యమవటంతో ఆయన్ను అరెస్టు చేశారు. ఆదివారం కోర్టులో హాజరుపరచనున్నారు. మిథున్‌రెడ్డితో కలిపితే ఈ కేసులో అరెస్టైన నిందితుల సంఖ్య 12కు చేరింది.

దారులన్నీ మూసుకుపోవటంతో..

మద్యం కుంభకోణంలో తన ప్రమేయం బయటపడిందని తెలియగానే మిథున్‌రెడ్డి మార్చి నెలలో ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టుకు వెళ్లారు. అప్పటికి ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చలేదు. దీంతో పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన మిథున్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ కొనసాగుతున్నంత కాలం అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడంతో బయటకొచ్చారు. ఏప్రిల్ 19న తొలిసారి సిట్ విచారణకు హాజరైనా దర్యాప్తు అధికారులకు సహకరించలేదు. వారి ప్రశ్నలకు సరైన సమాధానాలివ్వలేదు. దీంతో మిథున్‌రెడ్డిని నాలుగో నిందితుడు (ఏ4)గా చేర్చారు. వీటన్నింటిపై విచారించిన సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను పునఃపరిశీలన నిమిత్తం ఏపీ హైకోర్టుకు పంపించింది. ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేస్తూ ఈ నెల 15న ఏపీ హైకోర్టు ఆదేశాలిచ్చింది. అప్పటికే అజ్ఞాతంలో ఉన్న మిథున్‌రెడ్డి వెంటనే సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లారు. అక్కడా ఎదురుదెబ్బ తగలటంతో తప్పనిసరి పరిస్థితుల్లో సిట్ ముందుకొచ్చారు.

కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న మిథున్‌రెడ్డి శనివారం ఉదయం దిల్లీ నుంచి బయల్దేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12.40 గంటలకు సిట్ కార్యాలయానికి వెళ్లారు.

సొంత బ్రాండ్లతో దోచేసి..

'బిగ్‌బాస్ ఆదేశాల మేరకు మిథున్‌రెడ్డి.. నూతన మద్యం విధానం ముసుగులో ఘరానా దోపిడీకి తెరతీశారు. ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీగా, డిస్టిలరీస్, బ్రూవరీస్ కమిషనర్‌గా నియమించటంలో, ఎక్సైజ్ శాఖాధికారి డి.సత్యప్రసాద్‌కు కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి కల్పిస్తానని ప్రలోభపెట్టి.. ఆయన్ను పావుగా వాడుకుని దోపిడీ సాగించటంలో మిథున్‌రెడ్డిది ప్రధాన పాత్ర. ముడుపులు ఎలా వసూలు చేయొచ్చో ఆయనే మిగతా నిందితులతో కలిసి పన్నాగం పన్నారు. మద్యం బ్రాండ్ల మూల ధర ఆధారంగా కేసుకు రూ.150 నుంచి రూ.600 వరకు ముడుపులు వసూలు చేయొచ్చని, తద్వారా నెలకు రూ.5060 కోట్ల మేర వస్తాయని మిథున్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి నాయకత్వంలోనే నిర్ణయించారు. మద్యం సరఫరా ఆర్డర్ల జారీలో పారదర్శకత కోసం ఆటోమేటెడ్ విధానం అమల్లో ఉండేది. మిథున్‌రెడ్డి ఆదేశాలతోనే దాన్ని రద్దు చేయించి, దోపిడీకి వీలుగా మాన్యువల్ విధానాన్ని తీసుకొచ్చారు. ముడుపులిచ్చిన కంపెనీలకే అత్యధికంగా సరఫరా ఆర్డర్లు ఇస్తూ, అందుకు అంగీకరించని సంస్థలను తరిమేశారు. వాటి స్థానంలో సొంత బ్రాండ్లు తెచ్చారు. బేసిక్ ప్రైస్ (మూల ధర) భారీగా పెంచుకుని ఖజానాను కొల్లగొట్టారు. తమ ప్రణాళిక మేరకు ముడుపులు వసూలవుతున్నాయా? లేదా అనేది పర్యవేక్షించేందుకు మిథున్‌రెడ్డి తరచూ సమావేశాలు నిర్వహించేవారు. తన బృందం వసూలు చేసిన ముడుపులను రాజ్ కెసిరెడ్డి.. మిథున్‌రెడ్డితో పాటు నాటి ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితులైన మరికొందరికి చేర్చేవారు. దాన్ని మిథున్‌రెడ్డి బిగ్‌బాస్‌కు అందజేసేవారు. ఈ ముడుపుల్లో అత్యధిక శాతం బంగారం, నగదు రూపంలోనే తీసుకున్నారు. ముడుపుల వసూళ్లు, సొంత బ్రాండ్ల మద్యానికి ఎక్కువగా ఆర్డర్లు ఇచ్చుకోవటం ద్వారా మిథున్‌రెడ్డి రెండు విధాలా అనుచిత లబ్ధి పొందారు' అని సిట్ దర్యాప్తులో తేల్చింది.

మిథున్‌రెడ్డి కుటుంబ సంస్థ పీఎల్ఆర్ ఖాతాల్లోకి ముడుపుల సొమ్ము

'నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ (డిస్టిలరీ) వ్యాపార పునరుద్ధరణ, అభివృద్ధి కోసం అరబిందో గ్రూప్ ద్వారా రూ.45 కోట్ల రుణమిప్పించారు. ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు ఈ మద్యం ముఠాలో భాగస్వాములైన వారందరికీ నగదు రూపంలో ముడుపులు చెల్లించాలనేది దీని వెనుక ఉన్న ఒప్పందం. రుణంలో రూ.5 కోట్లను ఎంపీ మిథున్‌రెడ్డి ముడుపుల్లో తన వాటాగా.. తమ కుటుంబీకులు డైరెక్టర్లుగా ఉన్న పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాల్లో జమ చేయించుకున్నారు. మద్యం ముడుపులపై అప్పట్లో రచ్చ జరగటంతో.. ఆ రూ.5 కోట్లను తిరిగి హుడ్‌వింక్ అనే సంస్థ ఖాతాకు బదిలీ చేయించేశారు. ఆ మొత్తాన్ని నగదు రూపంలో తీసుకున్నారు' అని దర్యాప్తులో తేలింది.

# దేళ్లు తానే సీఎం అన్న రేవంత్ రెడ్డి.. ఎమ్మెల్యే

## రాజగోపాల్ రెడ్డి సంచలన ట్వీట్



ఈ కబురు: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించారు. ఢిల్లీ పర్యటన అనంతరం నేరుగా జిల్లా పర్యటనలో భాగంగా.. కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో.. ఆయన మాట్లాడుతూ.. 2034 వరకు ఈ పాలమూరు బిడ్డ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటాడని.. పాలమూరు గడ్డ నుంచి ప్రభుత్వాన్ని నడిపిస్తాడని.. సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాగా ఈ వ్యాఖ్యలపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందిస్తూ.. సంచలన ట్వీట్ చేశాడు. అందులో.. "రాబోయే పదేళ్లు నేనే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్ఠానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుంది. తెలంగాణ కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరు." అంటూ కామెంట్స్ రాసుకొచ్చారు. సీఎం హోదాలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఇప్పటికే గుస్సా అవుతుండగా.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన ట్వీట్ సంచలనంగా మారింది.



# మరో రెండు రోజులు భారీ వర్షాలు

**గ్రేటర్ సమీప జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్**

**కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి: వాతావరణ శాఖ**

ఈ కబురు, హైదరాబాద్: సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్రంలో రెండు రోజులుగా విస్తారంగా వర్షా లు కురుస్తున్నాయి. మరో రెండు రోజులపాటు ఇలాగే వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం గ్రేటర్ హైదరాబాద్ సమీప జిల్లాల్లో జోరు వాన నమోదైంది. హైదరాబాద్, జనగామ, మహబూబ్‌నగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నల్లగొండ, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, అదిలాబాద్ జిల్లాల్లో మరో రెండు రోజులు భారీ వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లాల కలెక్టర్లకు సూచించింది. నైరుతి రుతుపవనాల సీజన్ ప్రారంభం నుంచి వర్షా లు అంతంత మాత్రంగానే కురిశాయి. గత మూడు వారాలుగా వర్షా ల జాడలేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 26.23 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 20.43 సెంటీమీటర్లు మాత్రమే కురిసింది.

# ‘అవసరాలు ఓకే.. షోఆఫ్ వద్దు’.. బఫెట్ చెప్పిన 5 సూత్రాలు

**డబ్బులు సంపాదించడం కంటే.. దాన్ని ఎలా ఖర్చు చేస్తున్నామన్నది ముఖ్యం. చాలామంది యువతకు ఆర్థిక క్రమశిక్షణ ఉండడం లేదనేది పెద్దలు చెప్పేమాట. రూ.లక్షల్లో జీతం వస్తోంది కదా అని కార్లు, ఖరీదైన బైకులు కొనుగోలు చేసేస్తుంటారు కొందరు. సోషల్‌మీడియాలో ఆడంబరాలను ప్రదర్శిస్తుంటారు. వచ్చే జీతంతో సంబంధం లేకుండా క్రెడిట్ కార్డు సాయంతో ఎడాపెడా ఖర్చు చేసేస్తుంటారు. అలాంటివారు ప్రపంచ ప్రఖ్యాత మదుపరి వారెన్ బఫెట్ మాటల్ని ఓసారి గుర్తు చేసుకోవాల్సిందే. పొదుపు, మదుపు గురించి ఆయన చెప్పిన సూత్రాలు ఆచరణీయం. ఎక్కడ డబ్బు వృథా చేయకూడదో తెలిసిన వాడే డబ్బును కాపాడగలడని చెబుతారాయన. కాబట్టి డబ్బు ఖర్చు గురించి, అలాగే ఆయన చెప్పిన 5 మదుపు సూత్రాలేంటో ఓసారి చూద్దాం.**

**అవసరానికే ఇల్లు**

ప్రతిఒక్కరికీ సొంతిల్లు ఓ ఎమోషన్. సొంతింట్లో నివసించడంలో ఉండే సంతృప్తి వేరు. అయితే, డబ్బులున్నాయి కదా అని 2 బీహెచ్‌కే కొనుగోలు చేయాల్సిన చోట 4 బీహెచ్‌కే తీసుకోవడం అర్థం లేనిదంటారు బఫెట్. 1958లో కొనుగోలు చేసిన ఇంట్లోనే ఇప్పటికీ నివసిస్తున్నారాయన. మన అవసరానికి మించి ఇంటిని కొనుగోలు చేస్తే.. దానికి మెయింటెన్స్, ట్యాక్సులు, ఈఎంఐ.. ఇలా పెద్ద మొత్తంలో ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఇల్లు మనం ఉండడానికే తప్ప.. షో ఆఫ్ కోసం కాదంటారు.

**క్రెడిట్ కార్డు ఎంత మూల్యానికి?**

క్రెడిట్ కార్డు రెండువైపులా పదును కలిగిన కత్తి లాంటిది. దీన్ని ఎంత తెలివిగా వాడుకుంటే అంత మేలు. లేదంటే అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి బాటలు వేస్తుందని అంటారు వారెన్ బఫెట్. సౌలభ్యం కోసం క్రెడిట్ కార్డు వాడడం వరకు ఓకే గానీ, దాని ద్వారా అధికంగా ఖర్చు చేయడాన్ని అలవాటుగా మార్చుకోవద్దంటారు. ఒకవేళ మీరు మినిమమ్ బ్యాలెన్స్ చెల్లిస్తూ వెళితే వడ్డీల భారంతో అప్పుల ఊబిలో చిక్కుకుపోతారని, బయటకు రావడం చాలా కష్టమవుతుందని అంటారు బఫెట్.

**తరిగే ఆస్తి కారు**

రయ్ రయ్‌మంటూ సొంత కారులో దూసుకెళ్లాలని చాలామందికి ఉంటుంది. జీతం పెరిగిందనో, స్థోమత వచ్చిందనో వెంటనే కారు కొనుగోలు చేస్తుంటారు. చేతిలో తగిన మొత్తం లేకపోయినా ఈఎంఐ కట్టడానికీ సిద్ధమవుతుంటారు. చాలామంది చేసే తప్పు ఇదేనంటారు బఫెట్. షోరూమ్ నుంచి కారు బయటకు రాగానే దాని విలువ తరిగిపోతుందని, కేవలం ఐదేళ్లలోనే దాని విలువ సుమారు 60 శాతం మేర పడిపోతుందని చెబుతారు. మన పెట్టుబడులు ఎప్పుడూ వాటి విలువ పెంచే వాటిలో ఉండాలే తప్ప.. తగ్గించే వాటిలో కాదంటారు. మరి బఫెట్ అసలు కారే వాడరా? అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. ఆయన కారు వాడుతుంటారు. అయితే, 2014లో కొనుగోలు చేసిన క్యాడిలాక్ ఎక్స్‌టీఎస్‌ని వినియోగిస్తున్నారు. అదీ జనరల్ మోటార్ నుంచి డిస్కౌంట్ ధరకు కొనుగోలు చేయడం విశేషం.

**లాటరీ వద్దే వద్దు**

లాటరీలో అంత గెలిచారు.. ఆన్‌లైన్‌లో జూదమాడి ఇంత గెలిచారని వినడానికి బాగానే ఉన్నా.. లక్ ఆధారంగా నడిచే ఇలాంటి వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిదంటారు బఫెట్. జాక్‌పాట్ తగిలితే ఒక్క దెబ్బకు లక్షాధికారి అయిపోవచ్చని చాలా మంది భావిస్తుంటారు. వాస్తవానికి ఆ అదృష్టం దక్కేది కేవలం 10 లక్షల మందిలో ఒక్కరికి మాత్రమేనన్నది ఎవరూ గమనించరని చెప్తారు. కొన్నిసార్లు జూదంలో డబ్బులు వచ్చినట్లు అనిపించినా ఒకసారి ఆ చట్రంలో ఇరుక్కుంటే పోగొట్టుకోవడం తప్ప వచ్చేది ఉండదనేది ఆయన మాట.



**ఆ పెట్టుబడుల జోలికెళ్లొద్దు**

బంధువులు చెప్పారనో, స్నేహితుడు సూచించాడనో తెలియని పథకాల్లో పెట్టుబడులు పెడుతుంటారు కొందరు. ఆ పథకం గురించి సొంతంగా అధ్యయనం చేయరు. మీరు పెట్టుబడి చేస్తున్న పథకం అసలు మీకు అర్థమే కాకపోతే మీ డబ్బును రిస్క్‌లో పెడుతున్నట్లు అర్థం అంటారు బఫెట్. మరీ ముఖ్యంగా అధిక ప్రతిఫలం, ఎక్కువ లాభం వంటి పదాలు వినడానికి బాగానే ఉన్నా.. వాటిలో అంతే స్థాయిలో రిస్క్ దాగి ఉందనేది గమనించండి. కాబట్టి అలాంటి వాటి జోలికెళ్లొద్దంటారు బఫెట్. చివరిగా: మీరు సంపాదించిన దాంట్లో ఖర్చు చేయగా మిగిలినది పొదుపు చేయడం కాకుండా.. పొదుపు చేయగా మిగిలినది ఖర్చు చేయాలనేది బఫెట్ చెప్పే సూత్రం. అంతేకాదు.. మీ అవసరాల కోసం ఖర్చులు చేయడం వరకు ఓకే.. కానీ, ఆడంబరాల జోలికెళ్లొద్దనేది యువతకు బఫెట్ ఇచ్చే సలహా.




## ఇన్సూరెన్స్ కంపెనీలపై ప్యానెల్ ఏర్పాటు

బీమా సంస్థలు, మధ్యవర్తులు నిబంధనల ఉల్లంఘనలపై దృష్టి సారించేందుకు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ప్యానెళ్లను ఏర్పాటు చేసింది. ఐఆర్‌డీఏఐ 132వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. బీమా చట్టం, నియంత్రణపరమైన మార్గదర్శకాలను బీమా కంపెనీలు సరిగ్గా పాటిస్తున్నాయా? ఎక్కడైన ఉల్లంఘనలు చోటు చేసుకుంటున్నాయా? అన్నది పరిశీలించేందుకు పూర్తికాల సభ్యులతో కూడిన ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఐఆర్‌డీఏఐ ప్రకటించింది.

పాలసీలను తప్పుడు మార్గాల్లో విక్రయిస్తుండడం, డేటా లీకేజీ నివేదికల నేపథ్యంలో ఐఆర్‌డీఏఐ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కివి జనరల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి ఆర్ 1 దరఖాస్తుకు సైతం తాజా సమావేశంలో ఐఆర్‌డీఏఐ ఆమోదం తెలిపింది. దీని తర్వాత ఆర్ 2, ఆర్ 3 స్థాయిలోనూ ఆమోదం పొందాల్సి ఉంటుంది.



## ఈపీఎఫ్‌వో రూల్స్‌లో మార్పు.. ఆ కండీషన్లు ఇక ఉండవు

ఈపీఎఫ్ఓ (ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్) ఈడీఎల్ఐ అంటే ఎంప్లాయీ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ నిబంధనల్లో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ భారీ ఊరటనిచ్చింది. ఇప్పుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మునుపటిలా కఠినమైన షరతులు ఉండవు. దీని వల్ల లక్షలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు, ముఖ్యంగా విధుల్లో ఉండగా మరణించిన ఉద్యోగి కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుంది.

**కనీసం రూ .50,000 బీమా**

తాజా నోటిఫికేషన్ ప్రకారం.. ఇప్పుడు ఉద్యోగి పీఎఫ్ బ్యాలెన్స్ రూ .50,000 కంటే తక్కువగా ఉన్నప్పటికీ, ఆ ఉద్యోగి మరణించినప్పుడు వారి కుటుంబానికి కనీసం రూ .50,000 బీమా ప్రయోజనం లభిస్తుంది. ఇంతకు ముందు ఈ ప్రయోజనాన్ని పొందడానికి, ఉద్యోగి ఖాతాలో నిర్ణీత పరిమితి వరకు బ్యాలెన్స్ ఉండాలి. కానీ ఇప్పుడా షరతు తొలగించారు.

**మరో ముఖ్యమైన మార్పు**

కనీస పీఎఫ్ బ్యాలెన్స్ షరతును తొలగించడంతో పాటు ఈ పథకంలో మరో ముఖ్యమైన మార్పు చేశారు. ఈ పథకం కోసం 12 నెలల నిరంతర సర్వీసును లెక్కించేటప్పుడు, ఉద్యోగి కంపెనీలు మారిన సందర్భంలో రెండు ఉద్యోగాల మధ్య 60 రోజుల వరకు గ్యాప్ ఉంటే, దాన్ని ఇకపై విరామంగా పరిగణించరు. అంటే ఉద్యోగి రెండుమూడు ఉద్యోగాలు చేసి, వాటి మధ్య 2 నెలల కంటే తక్కువ విరామం ఉంటే, అప్పుడు అన్ని ఉద్యోగాలు ఒకే (నిరంతర) సర్వీసుగా పరిగణిస్తారు

అంతే కాకుండా పీఎఫ్ పథకంలో సభ్యుడైన ఉద్యోగి చివరి పీఎఫ్ కంట్రిబ్యూషన్ నుండి 6 నెలల్లోపు మరణించిప్పుడు కూడా వారి కుటుంబానికి ఈ పథకం కింద బీమా మొత్తాన్ని ఇస్తారు. అయితే ఆ సమయంలో ఉద్యోగి కంపెనీ రోల్స్‌లో నమోదై ఉండాలి. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణించినప్పుడు వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం ఈపీఎఫ్ఓ ఈడీఎల్ఐ పథకం ప్రధాన ఉద్దేశం.

# టీవీఎస్ నుంచి మరో బైక్.. ధర, ఫీచర్స్ ఇవే

**భారత మార్కెట్లోకి అనేక రకాల వాహనాలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే.. ఇండియన్ మార్కెట్లో.. రకరకాల కంపెనీల పేరుతో టూ వీలర్ వెహికల్స్ వచ్చేసాయి. సామాన్యులు కూడా కొనుగోలు చేసే ధరలో వాహనాలు వస్తున్నాయి. అయితే ఈ నేపథ్యంలోనే... ఇండియన్ మార్కెట్లోకి టీవీఎస్ కంపెనీ నుంచి సరికొత్త బైక్ మార్కెట్లోకి లాంచ్ అయింది.**

**టీవీఎస్ మోటార్ కంపెనీ ఆధ్వర్యంలో టీవీఎస్ అపాచీ RTR 310 - 2025 మోడల్ బైక్ ను తీసుకువచ్చారు. ఈ మేరకు కంపెనీ అధికారిక ప్రకటన చేసింది. ఇక.. కొత్తగా లాంచ్ అయిన అపాచీ RTR 310 బేస్ మోడల్ ప్రారంభ ధర 2.40 లక్షలు గా ఫిక్స్ చేశారు. ఇది ఎక్స్ షోరూం ప్రకారం మాత్రమే. ఈ ధర... ప్రాంతాలు బట్టి మారుతూ ఉంటుంది. ఇందులో టాప్ మోడల్ బైక్ 2.57 లక్షలుగా ఫైనల్ చేశారు. ప్రస్తుతానికి అయితే ఢిల్లీ, ముంబై, కోల్కత్తా, చెన్నై లాంటి ప్రధాన నగరాల్లో మాత్రమే ఈ బైక్స్ అందుబాటులోకి వచ్చాయి.**

**కొత్తగా లాంచ్ అయిన అపాచీ RTR 310 బైక్స్ నాలుగు కలర్స్ లో లభిస్తున్నాయి. ఫెరి రెడ్, అర్సనల్ బ్లాక్, ఫురీ ఎల్లో, బ్లూ కలర్స్ లో ఈ బైక్స్ లభిస్తోంది. ఈ బైక్ లో 310 సీసీ ఇంజన్ అమర్చారు. గేర్లను వేగంగా డౌన్ షిఫ్టింగ్ చేస్తున్నప్పుడు... వెనుక చక్రం లాక్ కాకుండా ప్రత్యేకంగా డిజైన్ చేశారు. 6650 RPM వద్ద 28.7 ఎన్ టార్క్ ను ఈ బైక్ రిలీజ్ చేస్తుంది.**



# శాంసంగ్ నుంచి కొత్త స్మార్ట్‌ఫోన్.. బడ్జెట్‌లోనే హై ఎండ్ ఫీచర్స్



దక్షిణ కొరియా స్మార్ట్ ఫోన్ దిగ్గజం శాంసంగ్ నుండి కొత్త ఎఫ్‌సిరీస్ ఫోన్ విడుదలైంది. శాంసంగ్ గెలాక్సీ ఎఫ్36 5జీ స్మార్ట్ ఫోన్ భారత్‌లో లాంచ్ అయింది. బడ్జెట్ ధర రూ .20,000 లోపే ఇది లభ్యమవుతుంది. ఎక్సినోస్ 1380 చిప్‌సెట్, 50 మెగాపిక్సెల్ ప్రైమరీ సెన్సార్స్ ట్రిపుల్ రియర్ కెమెరా సెటప్‌తోపాటు గూగుల్ సర్కిల్ టు సెర్చ్, జెమినీ లైవ్ సహా ఏఐ ఫీచర్లు ఇందులో ఉన్నాయి.

**శాంసంగ్ గెలాక్సీ ఎఫ్36 5జీ ధర**

గెలాక్సీ ఎఫ్36 5జీ 6జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.17,499గా ఉంది. శాంసంగ్ 8 జీబీ ర్యామ్ + 256 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.18,999గా నిర్ణయించారు. శాంసంగ్ కొత్త ఎఫ్‌సిరీస్ స్మార్ట్‌ఫోన్ జూలై 29 నుంచి ఫ్లిప్‌కార్ట్, శాంసంగ్ అధికారిక ఆన్లైన్ స్టోర్ ద్వారా కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉంటుంది. కోరల్ రెడ్, లక్స్ వయొలెట్, ఓనిక్స్ బ్లాక్ అనే మూడు కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. ఈ మూడు కలర్ వేస్‌లో లెదర్ ఫినిష్ రియర్ ప్యానెల్ ఉంది.

**స్పెసిఫికేషన్లు**

శాంసంగ్ గెలాక్సీ ఎఫ్ 36 5జీ డ్యూయల్ సిమ్ హ్యాండ్ సెట్, ఇందులో 6.7 అంగుళాల సూపర్ అమోలెడ్ డిస్ ప్లే, ఫుల్ హెచ్ డీ+ రిజల్యూషన్, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్లస్ ప్రొటెక్షన్ ఉన్నాయి.

సెల్ఫీ కెమెరా కోసం డిస్ ప్లే పైభాగంలో వాటర్ డ్రాప్ నాచ్ ను అందించారు. ఆక్టాకోర్ ఎక్సినోస్ 1380 ఎస్ వోసీ, మాలిజీ68 ఎంపీ5 జీపీయూతో ఈ ఫోన్ పనిచేస్తుంది. థర్మల్ మేనేజ్ మెంట్ కోసం వేపర్ ఛాంబర్ కూడా ఉంది. 8 జీబీ ర్యామ్, 256 జీబీ వరకు స్టోరేజ్, మైక్రో ఎస్డీ కార్డు ద్వారా పెంచుకోవచ్చు.

ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ఓఐఎస్), 4కే వీడియో రికార్డింగ్‌కు సపోర్ట్ చేసే ప్రైమరీ 50 మెగాపిక్సెల్ ఎఫ్/ 1.8 సెన్సార్‌తో ట్రిపుల్ రియర్ కెమెరా సెటప్ ఉంది. వీటిలో ప్రధాన కెమెరా సామర్థ్యం 8 మెగా పిక్సెల్ కాగా, దీంతోపాటు 2 మెగాపిక్సెల్ మాక్రో సెన్సార్ కూడా ఉంది. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం ముందువైపు 13 మెగాపిక్సెల్ కెమెరాను అందించారు. ఇది 4కె వీడియో రికార్డింగ్ ను కూడా సపోర్ట్ చేస్తుంది.

శాంసంగ్ లేటెస్ట్ ఎఫ్ సిరీస్ ఫోన్ ఆండ్రాయిడ్ 15 ఆధారిత వన్ యూఐ 7 ఆపరేటింగ్ సిస్టంపై పని చేస్తుది. ఆరు ఏళ్లు ఆండ్రాయిడ్ ఓఎస్ అప్ డేట్స్, ఏడేళ్ల సెక్యూరిటీ ప్యాచ్ లను అందిస్తామని కంపెనీ హామీ ఇస్తోంది.

గూగుల్ సర్కిల్ టు సెర్చ్, జెమినీ లైవ్, ఆబ్జెక్ట్ ఎరేజర్, ఇమేజ్ క్లిప్పర్, ఏఐ ఎడిట్ వంటి ఏఐ ఫీచర్లు కూడా ఉన్నాయి.

గెలాక్సీ ఎఫ్36 5జీలో 25వాట్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. ఇందులో సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సార్, ఛార్జింగ్ కోసం యూఎస్‌బీ టైప్‌సీ పోర్ట్ ఉన్నాయి. కనెక్టివిటీ కోసం, ఫోన్ డ్యూయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 5.3, జీపీఎస్ + గ్లోనాస్‌ను అందిస్తుంది.



# ‘ఫండ్’ స్థానంలో ‘స్కీమ్’



దిల్లీ: మ్యూచువల్ ఫండ్ పథకాలకు సంబంధించి ప్రస్తుతం పాటిస్తున్న వర్గీకరణను సమీక్షించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది. ఫండ్ పథకాల్లో మరింత స్పష్టత, పోర్ట్‌ఫోలియోలలో ఒకే తరహా పెట్టుబడులు లేకుండా చూడటంలాంటివి లక్ష్యంగా పెట్టుకుంది. కొన్ని ఫండ్ పథకాల్లో పెట్టుబడుల తీరును గమనించిన తర్వాత, ఇదే తరహా పోర్ట్‌ఫోలియోలతో వస్తున్న పథకాలను నివారించేందుకు స్పష్టమైన పరిమితులను తీసుకురావాలని భావిస్తోంది. ఈ మేరకు ఒక చర్చా పత్రాన్ని విడుదల చేసింది. అందులో సెబీ ప్రతిపాదనలు ఇలా..

మ్యూచువల్ ఫండ్ సంస్థలు వాల్యూ, కాంట్రా ఫండ్‌లను రెండింటినీ అందించేందుకు అనుమతించాలి

స్కీమ్‌ల పోర్ట్‌ఫోలియోలు ఏ సమయంలోనూ 50 శాతానికి మించి ఓవర్‌ల్యాప్ కాకూడదు. దీన్ని ఎన్ఎఫ్ఓ (న్యూ ఫండ్ ఆఫర్) తీసుకొచ్చిన సమయంలోనే కాకుండా, ఆరు నెలలు, వార్షిక ప్రాతిపదికన సమీక్షించాలి.

అనుమతించిన దానికంటే ఎక్కువ ఓవర్‌ల్యాప్ ఉంటే, ఫండ్ సంస్థ 30 వ్యాపార రోజుల్లో దాన్ని సమతుల్యం చేయాలి. అవసరాన్ని బట్టి, అదనంగా మరో 30 రోజుల గడువును పొందేందుకూ వీలుంటుంది. దీనికి సరైన కారణాలు వెల్లడించాలి.

ఈ వ్యవధి ముగిసిన తర్వాతా ఫండ్ సంస్థ పోర్ట్‌ఫోలియోను సరిదిద్దకపోతే.. మదుపరులకు ఎలాంటి అమ్మకపు రుసుము (ఎగ్జిట్ లోడ్) లేకుండా యూనిట్లను విక్రయించుకునేందుకు అవకాశం ఇవ్వాలి.

మ్యూచువల్ ఫండ్లు తమ పోర్ట్‌ఫోలియోలో మిగిలిన భాగాన్ని ఈక్విటీ, డెట్, బంగారం, వెండి, రీట్స్, ఇన్విట్స్ వంటి వాటిల్లో ఈక్విటీ విభాగం కిందే మదుపు చేసేందుకు అనుమతినివ్వాలి.

మదుపరులలో అవగాహన పెంచేందుకు డెట్ స్కీమ్‌ల పేర్లలోనూ మార్పులు చేయాలి. ముఖ్యంగా ‘డ్యూరేషన్’కు బదులుగా ‘టర్మ్’గా పేర్కొనాలి. పథకం పేరు.. పెట్టుబడి లక్ష్యాన్ని మరింత స్పష్టంగా ప్రతిబింబించేలా చూడాలి.

మ్యూచువల్ ఫండ్లు సెక్టోరియల్ డెట్ ఫండ్లను ప్రారంభించేందుకూ అనుమతినివ్వాలి.

మ్యూచువల్ ఫండ్ల పథకాల చివరలో ‘ఫండ్’ అనే పదాన్ని ‘స్కీమ్’గా మార్పు చేయాలి. ఉదాహరణకు ‘లార్జ్ క్యాప్ ఫండ్’ అని కాకుండా ‘లార్జ్ క్యాప్ స్కీమ్’ అని పిలవాలి.

ఇవే కాకుండా, హైబ్రిడ్, ఆర్బిట్రేజ్ ఫండ్లకూ మార్పులను ప్రతిపాదించింది. మొత్తం మీద ఈక్విటీఓరియెంటెడ్ స్కీమ్, డెట్‌ఓరియెంటెడ్ స్కీమ్, హైబ్రిడ్, సొల్యూషన్ ఓరియెంటెడ్ స్కీమ్, ఇతరాలు అనే 5 విభాగాల్లో అందుబాటులో ఉంటాయి. ఈ చర్చా పత్రంపై ప్రజలు ఆగస్టు 8 వరకూ సలహాలను అందించాలని ఆహ్వానించింది.



# గాయపడిన షారుక్ ఖాన్.. ‘కింగ్’ షూటింగ్ వాయిదా!

బాలీవుడ్ స్టార్ హీరో షారుక్‌ఖాన్ గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన హీరోగా తెరకెక్కుతోన్న ‘కింగ్’ షూటింగ్‌లో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గాయానికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా బయటకు రాలేదు. అయితే, అత్యవసర చికిత్స నిమిత్తం షారుక్ అతని బృందం అమెరికా వెళ్లినట్లు ఆంగ్ల మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఓ యాక్షన్ సన్నివేశంలో డూప్ లేకుండా స్టంట్ చేస్తుండగా ఆయనకు గాయాలైనట్లు కథనాలు పేర్కొన్నాయి. అది తీవ్రమైన గాయం కాదని, కండరాల గాయం అని వర్గాలు తెలిపాయి. దీంతో ప్రస్తుతం జరుగుతోన్న ‘కింగ్’ షూటింగ్‌ను సెప్టెంబర్‌కు వాయిదా వేసినట్లు కూడా వార్తలు వైరల్ అవుతున్నాయి.షారుక్ ఖాన్ ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘కింగ్’ . యాక్షన్ కథా నేపథ్యంలో ఈ చిత్రాన్ని సిద్ధార్థ్ ఆనంద్ రూపొందిస్తున్నారు.

ఇందులో సుహానాకు తల్లి పాత్రలో రాణీ ముఖర్జీ కనిపించనున్నట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.




# ‘కిల్లర్’ సినిమా ఫస్ట్ లుక్ విడుదల.. హీరోయిన్‌ను ఎత్తుకుని షాకింగ్ లుక్‌లో దర్శనమిచ్చిన సూర్య

మల్టీ టాలెంటెడ్ నటుడు ఎస్ జె సూర్యఓ వైపు వరుస సినిమాలు తెరకెక్కిస్తూనే పలు ప్రాజెక్ట్‌స్‌లో నటిస్తూ విలన్ పాత్రలో మెప్పిస్తున్నారు. అంతేకాకుండా సంగీత దర్శకుడిగానూ వ్యవహరిస్తున్నారు. పలు పాటలు కూడా పాడిన ఆయన ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. గత ఏడాది ‘సరిపోదా శనివారం’ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం ఎస్ జె సూర్య స్వయం దర్శకత్వంలో రాబోతున్న లేటెస్ట్ చిత్రం ‘కిల్లర్’. ఈ సినిమాకు కథ స్క్రీన్ ప్లే డైలాగ్స్ కూడా ఆయనే సమకూరుస్తుండటం విశేషం. ‘కిల్లర్’ చిత్రాన్ని శ్రీ గోకులం మూవీస్, ఏంజెల్ స్టూడియోస్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో సూర్య సరసన ప్రీతి అస్రాని హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఇటీవల ప్రారంభించారు. ఈక్రమంలో.. ఈ నెల 20న ఎస్ జె సూర్య పుట్టినరోజు కావడంతో ఒక రోజు ముందుగానే అభిమానులను ట్రీట్ ఇచ్చాడు. తాజాగా, ‘కిల్లర్’ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను షేర్ చేశారు. “అభిమానులు & స్నేహితులు మీ అందరికీ నా పుట్టినరోజు బహుమతి గాని అందిస్తున్నాను. రేపు ఉదయం మీరందరూ నా గురించి ప్రార్థనలు చేయండి.

నేను ఎప్పటిలాగే మీ అందరినీ నా ప్రార్థనలలో ఉంచుకుంటాను” అని రాసుకొచ్చారు. పోస్టర్‌లో ఆయన బ్లాక్ సూట్ ధరించి గాగూల్స్ పెట్టుకుని టై కట్టుకుని ఉన్నాడు. అలాగే ఒక చేతిలో గన్ పట్టుకుని ఎవరికో గురిపెట్టగా.. మరో చేతిలో హీరోయిన్ ప్రీతిని ఎత్తుకున్నాడు. ఆమె తన భుజాల పై నుంచి చూస్తూ గులాబీలు పట్టుకుని నవ్వుతూ కనిపించింది. అయితే ఈ పోస్టర్ మొత్తంలో ఎక్కువగా ఎరుపు రంగు కనిపిస్తుండటం గమనార్హం. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ.. ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. అలాగే కొంతమందిని షాక్‌కు గురి చేస్తోంది.




# ఆ రెండు సినిమాలు చేసి ఉండాల్సింది కాదు: నాగవంశీ

హైదరాబాద్: సినిమా కథల విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, కొన్నిసార్లు ఫెయిల్ అవుతాయని నిర్మాత నాగవంశీ అభిప్రాయపడ్డారు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘కింగ్డమ్’. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సత్యదేవ్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నాగవంశీ పలు అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

**ఆ రెండు ఖరీదైన తప్పులు..**

“మా బ్యానర్‌లో తెలిసి తప్పు చేసిన సినిమా ‘రణరంగం’. శర్వాకు ఆ ఏజ్డ్ క్యారెక్టర్ బాగోదని బాబాయ్ చెప్పినా నేనూ సుధీర్ వినిపించుకోలేదు. అయినా రిస్క్ చేశాం. బహుశా రవితేజలాంటి నటుడు చేసి ఉంటే బాగుండేదేమో. ఫస్ట్ సీన్‌లో శర్వాను డాన్‌గా చూపించాం. అతడు డాన్ ఎలా అయ్యాడన్నది తెలుసుకోవాలన్న ఆసక్తి ప్రేక్షకుడికి ఏం ఉంటుంది? అని ఒక రివ్యూవర్ అడిగారు. మాకు కరెక్టే అనిపించింది. ఆ తర్వాత తప్పులు చేయకూడదని కథల విషయంలో నిర్మొహమాటంగా ఉండే వారితో చర్చించేవాడిని. అయినా కూడా ‘ఆది కేశవ’ విషయంలో దెబ్బతిన్నాం. అవుట్‌పుట్ చూసుకున్న తర్వాత రిపేర్ చేయడానికి ప్రయత్నించాం. అదే సమయంలో జానర్‌లు మారిపోతున్నాయి. ఈ రెండు మా బ్యానర్‌లో చాలా ఖరీదైన తప్పులు”

**పాప్‌కార్న్ రేట్లు తగ్గించమని కోరతాం..**

“మల్టీప్లెక్స్‌లలో పాప్‌కార్న్ ధర సామాన్యుడే కాదు. నేనూ మోయలేను. ఇటీవల ఓ సినిమాకు వెళ్తే రెండు పాప్‌కార్న్, కూల్ డ్రింక్స్ తీసుకుంటే రూ.1200 అయింది. నేను మాత్రం ఏం చేయగలను. థియేటర్‌లో తినుబండారాల రేట్లను క్రమబద్ధీకరించాలని తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలను కోరాలనుకుంటున్నాం. ఎందుకంటే, కొన్ని మల్టీప్లెక్స్‌ల నిర్వాహకులకు మేము చెప్పగలం. కానీ, దేశవ్యాప్తంగా ఉన్న మల్టీప్లెక్స్ చైన్‌లను నిర్వహిస్తున్న వారు సాధ్యం కాదని అంటారు. మనం చెబితే అయ్యే పనులు కాదవి. ప్రభుత్వాలే నిర్ణయాలు తీసుకోవాలి”

**వీరమల్లును డిస్ట్రబ్ చేయను..**

“‘హరి హర వీరమల్లు’ చాలా పెద్ద సినిమా. కల్యాణ్‌గారు డిప్యూటీ సీఎం అయిన తర్వాత వస్తున్న సినిమా కూడా. ఒక నగరంలో 10 థియేటర్లు ఉంటే, వీరమల్లు విడుదలైన రోజున అన్ని థియేటర్లలో ఆడుతుంది. తర్వాతి వారానికి కనీసం నాలుగైదు థియేటర్లలో వేరే సినిమా వేసుకునే అవకాశం లభిస్తుంది. ఆ నాలుగు థియేటర్లు చాలు. నేను ‘హరి హర వీరమల్లు’ను డిస్ట్రబ్ చేయను. ఇప్పటికే కింగ్డమ్ చాలా తేదీలు మారింది. మరీ ఆలస్యం చేస్తే, ఓటీటీకి ఇబ్బంది అవుతుంది” అని నాగవంశీ పేర్కొన్నారు.

# నాట్ టచింగ్.. ఓన్లీ హార్ట్ టచింగ్.. అంటున్న లిటిల్ హార్ట్స్

‘90స్ మిడిల్ క్లాస్ బయోపిక్’ ఫేమ్ మౌళి తనూజ్, ‘అంబాజీపేట మ్యారేజ్ బ్యూరో’ ఫేమ్ శివానీ నాగరం హీరోహీరోయిన్‌గా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘లిటిల్ హార్ట్స్’. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ నిర్మిస్తోన్న ఈ మూవీకి సాయి మార్తాండ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం నుంచి లేటెస్ట్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ‘నాట్ టచింగ్.. ఓన్లీ హార్ట్ టచింగ్’ అనే క్యాప్షన్ ఇచ్చి షేర్ చేసిన ఈ పోస్టర్‌లో మౌళి అండ్ శివానీ క్యూట్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. యువతను ఆకట్టుకునే అంశాలతో రూపొందోన్న ఈ మూవీ త్వరలో థియేటర్‌లలో రిలీజ్ కాబోతుంది అంటూ తెలిపారు మేకర్స్. ఇక ఆదిత్య హాసన్ నిర్మిస్తున్న ‘లిటిల్ హార్ట్స్’ చిత్రానికి సిన్‌జిత్ యర్రమల్లి సంగీతం అందిస్తుండగా.. నటీనటులు, ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.




# కన్నడ కంటే తెలుగులోనే అదిరిపోయే వసూళ్లు

నిన్న అనగా శుక్రవారం రిలీజైన సినిమాల్లో కాస్తోకూస్తో 'జూనియర్' మంచి బజ్ సొంతం చేసుకుంది. అందుకు తగ్గట్లే పాజిటివ్ టాక్ రావడంతో టికెట్స్ బాగానే సేల్ అయ్యాయి. కలెక్షన్ కూడా బాగానే వచ్చినట్లు తెలుస్తోంది. గాలి జనార్ధనరెడ్డి కొడుకు కిరీటి హీరోగా పరిచయమైన ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. ఇంతకీ ఈ మూవీ తొలిరోజు వసూళ్లు ఎంతొచ్చాయి? తెలుగు రాష్ట్రాల్లో ఎన్ని కోట్లు వచ్చాయనేది ఇప్పుడు చూద్దాం.

కిరీటిని హీరోగా పరిచయం చేస్తూ 'జూనియర్' అనే సినిమాని దాదాపు రెండు మూడేళ్ల క్రితం ప్రకటించారు. షూటింగ్ పూర్తయినా సరే చాలా ఆలస్యమైన ఈ చిత్రం.. ఎట్టకేలకు తాజాగా థియేటర్లలోకి వచ్చింది. ఈ వీకెండ్ చెప్పుకోదగ్గ మూవీస్ ఏం లేకపోవడంతో 'జూనియర్'కి ప్లస్ అయింది. అందుకు తగ్గట్లే తొలిరోజు రూ.1.4 కోట్ల నెట్ కలెక్షన్ వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. కన్నడ కంటే తెలుగులోనే ఎక్కువ మొత్తం వసూలు కావడం విశేషం.

కిరీటి స్వతహాగా కన్నడ అయినప్పటికీ.. తెలుగులో 'జూనియర్' చిత్రానికి మంచి క్రేజ్ ఏర్పడింది. దానికి శ్రీలీల ఓ కారణం కాగా, 'వైరల్ వయ్యారి' పాట తెగ వైరల్ కావడం మరో కారణం అని చెప్పొచ్చు. తొలిరోజు తెలుగులో రూ.1.25 కోట్లు రాగా.. కన్నడలో కేవలం రూ.15 లక్షలే వచ్చినట్లు తెలుస్తోంది తొలి సినిమానే అయినప్పటికీ కిరీటి డ్యాన్సులు, ఫైట్స్‌కి మంచి రెస్పాన్స్ వస్తోంది. మూవీ కోసం బడ్జెట్ కూడా గట్టిగానే పెట్టారు. అయితేనే తొలిరోజు మంచి వసూళ్లే వచ్చాయి. లాంగ్ రన్‌లో కాస్త చెప్పుకోదగ్గ కలెక్షన్స్ రావడం గ్యారంటీ అనిపిస్తోంది.

'జూనియర్' విషయానికొస్తే.. జ్ఞాపకాలే ముఖ్యమనుకునే కుర్రాడు అభి (కిరీటి). కాలేజీలో సరదాగా గడుపుతూనే చదువులో మంచి ప్రతిభ చూపిస్తాడు. తను ప్రేమించిన శ్రీలీల పనిచేసే కంపెనీలోనే ఉద్యోగం సంపాదిస్తాడు. కానీ ఆ కంపెనీ బాస్ విజయ (జెనీలియా)కు అభి అస్సలు నచ్చడు. ఆమెకు తన పేరుతో ఉన్న విజయనగరం అనే ఊరు కూడా నచ్చదు. అలాంటిది అభితో కలిసి విజయ.. విజయనగరం వెళ్లాల్సి వస్తుంది. అక్కడికి వెళ్లాక ఏం జరిగింది? ఆ ఊరికి విజయకు సంబంధమేంటి అనేది మిగతా స్టోరీ.



# భర్తకు దూరంగా హన్సిక? తల్లింట్లోనే నివాసం! సోహైల్ ఏమన్నాడంటే?

నీకై నేను, నాకై నువ్వు ఉంటే చాలు కదా... అని పాటలు పాడుకునేవారు హన్సిక -సోహైల్ . ఈ జోడీకి ఎవరి దిష్టి తగలకూడదు అనేలా ఒకరినొకరు అపురూపంగా చూసుకునేవారు. అలాంటిది.. వీరిద్దరూ విడిపోతున్నట్లు ప్రచారం మొదలైంది. జాతీయ మీడియాలో వస్తున్న కథనాల ప్రకారం.. హన్సిక, సోహైల్ రెండేళ్లుగా విడివిడిగా నివసిస్తున్నారట! హన్సిక తన తల్లితో.. సోహైల్ అతడి పేరెంట్స్‌తో ఉంటున్నారని ప్రచారం జరుగుతోంది. విడివిడిగా.. అయితే విడాకుల రూమర్స్ గురించి సోహైల్ స్పందిస్తూ.. అందులో నిజం లేదని తేల్చిపారేశాడు. కానీ, వేర్వేరుగా జీవిస్తున్నారన్న అంశంపై మాత్రం ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదు. కాగా హన్సిక- సోహైల్ 2022లో పెళ్లి చేసుకున్నారు. ప్రతి ఏడాది పెళ్లిరోజున స్పెషల్ ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది హీరోయిన్. గతేడాది డిసెంబర్‌లో కూడా సెకండ్ యానివర్సరీ అంటూ ఓ పోస్ట్ పెట్టింది హన్సిక. దీన్ని బట్టి చూస్తే వీరు కలిసే ఉన్నారని తెలుస్తోంది. మరి తర్వాతేమైనా జరిగిందా? లేదా లేనిపోని రూమర్లు సృష్టిస్తున్నారా? అనే విషయంపై హన్సిక స్పందించాల్సి ఉంది.

సోహైల్‌కు రెండో పెళ్లి..ఇదిలా ఉంటే సోహైల్.. గతంలో హన్సిక చిన్ననాటి స్నేహితురాలు రింకీ బజాజ్‌ను పెళ్లి చేసుకున్నాడు. ఈ పెళ్లికి హన్సిక కూడా హాజరైంది. కానీ ఆ బంధం ఎంతోకాలం నిలవకపోవడంతో విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత సోహైల్‌తో కనెక్ట్ అయిన హన్సిక అతడిని వివాహం చేసుకుంది. జైపూర్‌లో జరిగిన ఈ పెళ్లి విశేషాలను లవ్ షాదీ డ్రామా వీడియో పేరిట ఓటీటీలోనూ రిలీజ్ చేశారు. అందులో హన్సిక.. సోహైల్ గతం గురించి చెప్తూ ఎమోషనలైంది. సోహైల్ గతం గురించి తెలుసు, కానీ.. అతడి విడాకులతో తనకు సంబంధం లేదని ఏడ్చేసింది.






# క్రికెట్ ఒక్కటేనా?.. అదో పెద్ద సామ్రాజ్యం! ఆర్థిక వనరులు ఇవే..

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రపంచ క్రికెట్‌లో పెద్దన్న పాత్ర పోషిస్తుంది. వరల్డ్‌లోనే సంపన్నమైన క్రికెట్ బోర్డుగా బీసీసీఐ ఖ్యాతి గడించింది. తాజాగా బీసీసీఐ మరోసారి సంపద సృష్టిలో చరిత్ర సృష్టించింది. 202324 ఆర్థిక సంవత్సరానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి రికార్డు స్థాయిలో రూ.9,741.7 కోట్ల ఆదాయాన్ని సంపాదించినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ఈ క్రమంలో భారత క్రికెట్ బోర్డుకు ఆదాయం వచ్చే మార్గాలపై ఓ లుక్కేద్దాం.

**ఐపీఎల్ బంగారు బాతు..**

భారత క్రికెట్ బోర్డుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) బంగారు బాతులా మారింది. 2007లో పురుడుపోసుకున్న ఐపీఎల్.. బీసీసీఐకి ప్రధాయ ఆదాయ వనరుగా ఉంది. తాజా నివేదిక ప్రకారం 20232024 సంవత్సరానికి గాను ఈ క్యాష్‌రిచ్ లీగ్ నుంచి రూ. 5,761 కోట్లు బోర్డు ఖాతాలో చేరాయి. మీడియా హక్కులు, ఫ్రాంచైజీ ఫీజులు, స్పాన్సర్షిప్‌ల రూపంలో వచ్చాయి. బీసీసీఐ ఆర్జించిన మొత్తంలో 59 శాతంతో ఐపీఎల్ ప్రధాన వాటాదారుగా నిలిచింది. అదేవిధంగా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ద్వారా బీసీసీఐకి రూ.1042 కోట్లు (10.7%) వచ్చాయి.

అంతేకాకుండా ఐపీఎల్ యేతర మీడియా హక్కుల( భారత అంతర్జాతీయ మ్యాచ్‌లు బ్రాడ్‌కాస్టింగ్) ద్వారా బోర్డు అదనంగా రూ. 813 కోట్లు సంపాదించింది. మరోవైపు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ అరంగేట్ర సీజన్ ద్వారా బోర్డుకు రూ. 378 కోట్లు వచ్చాయి.

భారత్ అంతర్జాతీయ పర్యటనలో టికెట్ అమ్మకాలు, స్పాన్సర్లు, లైసెన్సింగ్ ద్వారా 361 కోట్లు అదనంగా బీసీసీఐకి లభించాయి. స్టేడియంలో ప్రకటనలు, జరిమానాలు, ఇతర రుసుముల రూపంలో భారత క్రికెట్ బోర్డుకు 400 కోట్ల ఆదాయం సమకూరింది.

**వెయ్యి కోట్ల పైగా వడ్డీ..**

భారత క్రికెట్ బోర్డు దగ్గర దాదాపు రూ. 30 వేల కోట్లు రిజర్వ్‌లో ఉన్నాయి. దీని వల్ల ఏడాదికి రూ. 1,000 కోట్ల వడ్డీ వస్తున్నట్లు తెలుస్తోంది.

**బీసీసీఐకి ఖర్చు కూడా ఎక్కువే..**

భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆదాయాన్ని సంపాదించడంలోనే కాదు ఖర్చు చేయడంలో మిగిలిన బోర్డులకంటే ముందు ఉంది. క్రికెట్ అభివృద్ధి కోసం బీసీసీఐ ఖర్చు చేసే అంశాలను ఓసారి పరిశీలిద్దాం. ఆటగాళ్ల జీతాలు, మ్యాచ్ ఫీజులు, బోనస్‌లు కింద బీసీసీఐ ప్రతీ ఏటా రూ.250 కోట్ల పైగా ఖర్చుచేస్తోంది. అదేవిధంగా కోచింగ్ స్టాఫ్ జీతాల కోసం రూ.100 కోట్ల పైగా బీసీసీఐ వెచ్చిస్తోంది.

అంతేకాకుండా స్టేట్ క్రికెట్ అసోయేషిన్‌లకు నిధుల రూపంలో రూ.1000 కోట్ల పైగా భారత క్రికెట్ బోర్డు ఖర్చుచేస్తోంది. మ్యాచ్‌లను నిర్వహించేందుకు రూ. 500 కోట్లు, మహిళల క్రికెట్ అభివృద్ధి కోసం 150 కోట్లు బీసీసీఐ ప్రతీ ఊటా కేటాయిస్తోంది. పరిపాలన, కార్యకలాపాలు (ట్రావిలింగ్, మార్కెటింగ్) కోసం బీసీసీఐ 300 పైగా కోట్లు ఖర్చు చేస్తోంది.




# మాంచెస్టర్ టెస్టు.. శుభ్‌మన్ గిల్‌కు అతిపెద్ద పరీక్ష: గ్రెగ్ చాపెల్

ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా జులై 23 నుంచి మాంచెస్టర్ వేదికగా ఇంగ్లాండ్, భారత్ మధ్య నాలుగో మ్యాచ్ మొదలుకానుంది. ఈ మ్యాచ్‌కు అత్యంత కీలకం. ఇందులో ఓడినా లేదా మ్యాచ్ డ్రా అయినా ఇంగ్లాండ్ గడ్డపై సిరీస్ గెలిచే అవకాశాన్ని టీమ్‌ఇండియా చేజార్చుకుంటుంది. ప్రస్తుతం సిరీస్‌లో భారత్ 12తో వెనుకబడి ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆసీస్ మాజీ క్రికెటర్, భారత మాజీ కోచ్ గ్రెగ్ చాపెల్ నాలుగో మ్యాచ్ గురించి ఓ క్రీడావార్త సంస్థకు కాలమ్ రాశాడు. శుభ్‌మన్ గిల్ కు మాంచెస్టర్ టెస్టు రూపంలో అతిపెద్ద పరీక్షను ఎదుర్కొనబోతున్నాడని చాపెల్ అన్నాడు. ఈ మ్యాచ్ శుభ్‌మన్‌కు బ్యాటర్‌గానే కాకుండా కెప్టెన్‌గానూ కఠిన సవాలు అని పేర్కొన్నాడు.

'గిల్ కెప్టెన్‌గా ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాడు. అతను భావోద్వేగాలను ప్రదర్శిస్తున్నాడు. కానీ, టైమ్‌లైన్ ఉదారంగా లేదు. నిజానికి, లార్డ్స్‌లో మైదానంలో గిల్ వ్యవహరించిన తీరు చూడటానికి బాగుంది. సమయం వృథా చేయడం గురించి జాక్ క్రాలీపై స్లెడ్జింగ్ చేశారు. కానీ, మ్యాచ్‌ల్లో విజయం సాధించినప్పుడు మాత్రమే ఇలాంటివి అర్థవంతంగా ఉంటాయి. బాగా మాట్లాడేవారు గొప్ప కెప్టెన్లుగా మారతారు. గిల్ కూడా చాలా త్వరగా వారిలో ఒకరిగా మారాలి. సాధన చేస్తున్నప్పుడు, ఆట మధ్యలో, విరామ సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో స్పష్టంగా, ప్రశాంతంగా మాట్లాడాలి. గిల్ ప్రతి మ్యాచ్‌లో పరుగులు చేయలేదు. అతను జట్టు వాతావరణాన్ని ఉల్లాసంగా ఉంచుతూ ఆటగాళ్లను ప్రోత్సహించే విధంగా వారికి నమ్మకాన్ని కలిగించే విధంగా మాట్లాడటం నేర్చుకోవాలి' అని చాపెల్ వివరించాడు.

రవీంద్ర జడేజా పోరాటంతో లార్డ్స్ టెస్టులో భారత్ చివరి వరకు పోరాడి ఓడింది. అయితే, ఈ మ్యాచ్‌లో జడేజా రిస్క్ తీసుకోవాల్సిందని చాపెల్ అభిప్రాయపడ్డాడు. 'బంతులను వదిలేస్తూ సింగిల్స్ తీస్తే ఎలా.. గెలవాల్సిన మ్యాచ్‌లో ఇలా ఎవరైనా ఆడతారా? 'టెయిలెండర్లు నీకు మద్దతుగా మాత్రమే నిలవగలరు. నువ్వే ఈ మ్యాచ్ గెలిపించాలి' అని డ్రెస్సింగ్ రూమ్ నుంచి జడేజాకు సందేశం పంపాల్సింది' అని వ్యాఖ్యానించాడు.

# ఆకాష్ దీప్‌ను పక్కన పెట్టండి.. అతడిని జట్టులోకి తీసుకోండి: ఇంగ్లండ్ మాజీ కెప్టెన్

**ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్, ఇంగ్లండ్ మధ్య నాలుగో టెస్టు జూలై 23 నుంచి ప్రారంభం కానుంది. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫర్డ్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో అమీతుమీ తెల్చుకోవడానికి ఇరు జట్లు సిద్ధమయ్యాయి. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని భారత్ భావిస్తుంటే.. ఇంగ్లండ్ మాత్రం లార్డ్స్ ఫలితాన్ని పునరావృతం చేయాలని ఉవ్విళ్లూరుతోంది.**




ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా మెనెజ్‌మెంట్‌కు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కీలక సూచన చేశాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్ పిచ్ ఫ్లాట్‌గా ఉంటుందని, భారత్ ముగ్గురు స్పిన్నర్లతో ఆడితే సరిపోతుందని అథర్టన్ అన్నారు. కాగా లార్డ్స్ టెస్టులో భారత్ ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో ఆడింది. నితీశ్ కుమార్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా ఉన్నాడు. ఒకవేళ మాంచెస్టర్‌లో భారత్ ముగ్గురు స్పిన్నర్లతో ఆడాలని భావిస్తే.. పేసర్ ఆకాష్‌దీప్‌పై వేటు పడే ఛాన్స్ ఉంది. "మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫర్డ్ పిచ్ ఫ్లాట్‌గా ఉండే ఛాన్స్ ఉంది. దీంతో ఇటువంటి పరిస్థితుల్లో మణికట్టు స్పిన్నర్లు చక్రం తిప్పుతారు అని అందరికి తెలుసు. కాబట్టి భారత్ బుమ్రా, సిరాజ్‌లతో పాటు ముగ్గురు స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, జడేజా,కుల్దీప్ యాదవ్‌లతో ఆడితే బాగుంటుంది.

ఇది కేవలం నా అభిప్రాయం మాత్రమే. అయితే మాంచెస్టర్‌లో వాతావరణ పరిస్థితులపై మనకు అంచనా లేదు. ఒకవేళ వాతావరణం చల్లగా ఉండి, వర్షం పడితే ఫాస్ట్ బౌలర్లకు పిచ్ అనుకూలిస్తోంది. కానీ ముగ్గురు స్పిన్నర్లతో ఆడడం కోసం భారత మెనెజ్‌మెంట్ కచ్చితంగా ఆలోచించాలి" అని స్కై స్పోర్ట్‌స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మైఖేల్ అథర్టన్ పేర్కొన్నాడు.



# రెండో వన్డేలో భారత్‌పై ఇంగ్లాండ్ విజయం

**లండన్:** భారత్ ఇంగ్లాండ్ మహిళల జట్ల మధ్య లార్డ్స్ వేదికగా జరిగిన రెండో వన్డేలో ఇంగ్లాండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా లక్ష్యాన్ని 24 ఓవర్లలో 115 పరుగులకు కుదించారు. ఈ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ రెండు వికెట్లు కోల్పోయి 21 ఓవర్లలో చేధించింది. అమీ జోన్స్ (46*; 57 బంతుల్లో 5 ఫోర్లు), సోఫీ డంక్లీ (9*; 9 బంతుల్లో 2 ఫోర్లు), నాట్ సీవర్ (21; 25 బంతుల్లో 2 ఫోర్లు), టామీ బ్యూమాంట్ (34; 35 బంతుల్లో 5 ఫోర్లు) పరుగులు సాధించారు. భారత్ బౌలర్లలో స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్ చెరో వికెట్ పడగొట్టారు. వర్షం కారణంగా మ్యాచ్ నాలుగు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో మొదటి ఇన్నింగ్స్ ఆటను 29 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. స్మృతి మంధాన (42; 51 బంతుల్లో 5 ఫోర్లు) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భారత్ ఇంగ్లాండ్ చెరో మ్యాచ్‌లో విజయం సాధించాయి.

# భారత్‌తో రెండో వన్డే.. ఇంగ్లాండ్ లక్ష్యం 144





**లండన్:** మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్ మహిళల జట్టు, భారత్ మధ్య రెండో మ్యాచ్ జరుగుతోంది. వర్షం కారణంగా మ్యాచ్ నాలుగు గంటలు ఆలస్యంగా ప్రారంభం కాగా.. ఆటను 29 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. స్మృతి మంధాన (42; 51 బంతుల్లో 5 ఫోర్లు) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేసింది. దీప్తి శర్మ (30*), హర్లీన్ డియోల్ (16), అరుంధతి రెడ్డి (14) పరుగులు చేశారు. ప్రతీకా రావల్ (3), హర్మన్‌ప్రీత్ కౌర్ (7), జెమీమా రోడ్రిగ్స్ (3), రిచా ఘోష్ (2), స్నేహ్ రాణా (6) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 3, ఎమ్ ఆర్లోట్ 2, లిన్సే స్మిత్ 2, షార్లెట్ డీన్ ఒక వికెట్ పడగొట్టారు.